సాక్షి మహబూబ్‌నగర్

గురువారం । 27 । మార్చి । 2025



జోరుగా ఉల్లి వ్యాపారం

దేవరకద్ర మార్కెట్‌యార్డులో బుధవారం ఉల్లి వ్యాపారం జోరుగా సాగింది.

వివరాలు 8లో ▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-37 (గురువారం సాయంత్రం)

సహర్ 4-55 (శుక్రవారం తెల్లవారుజామున)

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 38.8 /19.6

ఉదయం నుంచే ఎండగా ఉంటుంది. ఉక్కపోత పెరుగుతుంది. సాయంత్రం జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వడ్డీపై 90 శాతం రాయితీ

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఆస్తిపన్ను బకాయిలపై విధించిన వడ్డీపై వన్‌టైం సెటిల్మెంట్ కింద 90 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశం ఈనెల 31వ తేదీ వరకు మాత్రమే ఉంటుందని, దీనిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

‘టెన్త్’ పరీక్షకు 40 మంది విద్యార్థుల గైర్హాజరు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా బుధవారం పదో తరగతి గణితం పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మొత్తం 12,855 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 12,815 మంది హాజరయ్యారు. 40 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. కలెక్టర్ విజయేందిర రెండు, అడిషనల్ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, ఎస్పీ జానకి, జిల్లా పరిశీలకుడు ఒక్కటి, డీఈఓ ఎనిమిది మంది, అసిస్టెంట్ కమిషన్ రెండు, స్క్వాడ్ బృందాలు 28 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

విధుల్లో అప్రమత్తంగా ఉండాలి



స్టేషన్ మహబూబ్‌నగర్: ఉద్యోగులు ఎల్లప్పుడూ విధుల్లో అప్రమత్తంగా ఉండాలని డివిజనల్ రైల్వే మేనేజర్ లోకేష్ వైష్ణోయి అన్నారు. జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో బుధవారం వివిధ రైల్వే విభాగాల ఉద్యోగుల ఫ్యామిలీ కౌన్సెలింగ్, హెల్త్ గ్రీవెన్ క్యాంప్ నిర్వహించారు. ఆయన ఉద్యోగులు, కుటుంబసభ్యులకు పలు సూచనలు చేశారు. ఉద్యోగులు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. అనంతరం ఉద్యోగుల కుటుంబ సభ్యుల సమస్యలను గ్రీవెన్స్ క్యాంపులో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీఎంఎస్ డాక్టర్ సీహెచ్ పద్మ, సీనియర్ సీఎంఈ కమల్‌కాంత్, సీనియర్ డీఎస్ఓ కె.విజయ్‌కుమార్, సీనియర్ డీఓఎం విద్యాధర్, సీనియర్ డీపీఓ జీఆర్.సుధీర్‌కుమార్, సీనియర్ డీఈటీఈ నీల పబని, డీఈఎన్ లైన్స్ అరుణ్‌కుమార్ శర్మ, డాక్టర్ బీటీ.నవీన్‌కుమార్, డాక్టర్ భీమ్‌దాస్ నాయక్ పాల్గొన్నారు.


ఆర్‌ఎన్‌ఆర్ క్వింటాల్ ధర రూ. 2,079

దేవరకద్ర: దేవరకద్ర మార్కెట్ యార్డులో బుధవారం జరిగిన టెండర్లలో ఆర్‌ఎన్‌ఆర్ ధాన్యం ధర క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.2,079, కనిష్ఠంగా రూ.1,962గా నమోదయ్యాయి. ఆముదాలు గరిష్ఠంగా రూ.6,019, కనిష్ఠంగా రూ.5,931గా ధరలు పలికాయి. సీజన్ ప్రారంభం కావడం వల్ల మార్కెట్‌కు దాదాపు మూడు వందల బస్తాల ధాన్యం అమ్మకానికి వచ్చింది. నారాయణపేట మార్కెట్‌లో శనగలు రూ.5,666 ఒకే ధర పలికాయి. పెసర గరిష్ఠంగా రూ.7,576, కనిష్ఠంగా రూ.7,219, వేరుశనగ గరిష్ఠంగా రూ.5,600, కనిష్ఠంగా రూ.4,350. జొన్నలు గరిష్ఠంగా రూ.4,570, కనిష్ఠంగా రూ.2,852, ఎర్ర కందులు గరిష్ఠంగా రూ.7,239, కనిష్ఠంగా రూ.6,700, తెల్ల కందులు గరిష్ఠంగా రూ.7,429, కనిష్ఠంగా రూ.7,411లు లభించాయి.

- నాగర్‌కర్నూల్, పేట మినహా మిగిలిన 3 జిల్లాల్లో రసవత్తరం
- మహబూబ్‌నగర్‌లో పైచేయి కోసం ఇద్దరు ఎమ్మెల్యేల ప్రయత్నాలు
- తమ వర్గానికి దక్కేలా పావులు.. గద్వాల, వనపర్తిలోనూ వర్గ పోరు
- రేపు ఢిల్లీలో డీసీసీ అధ్యక్షులతో కాంగ్రెస్ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ భేటీ
- టీపీసీసీ కార్యవర్గం అనంతరమే జిల్లా, బ్లాక్, మండల కమిటీల నియామకం

ఢీసీసీ..!

కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష పదవులకు పోటాపోటీ



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో అటు ప్రభుత్వ పదవులతో పాటు పార్టీ పదవులకు తీవ్ర పోటీ నెలకొంది. ఉమ్మడి పాలమూరులోని ఐదు జిల్లాల పరిధిలో ప్రధానంగా డీసీసీ పీఠాలపై పలువురు నేతలు కన్నేశారు. మహబూబ్‌నగర్ జిల్లాలో ఆశావహులు అధిక సంఖ్యలో ఉండగా.. జోగుళాంబ గద్వాల, వనపర్తి జిల్లాల్లో కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష పదవులను తమ మద్దతుదారులకు కేటాయించాలనే లక్ష్యంతో ఆయా వర్గాలు ప్రయత్నాలు ముమ్మరం చేశాయి. నారాయణపేట, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో మాత్రం డీసీసీ అధ్యక్ష పదవికి పోటీ నామమాత్రంగానే ఉన్నట్లు తెలుస్తోంది.

మహబూబ్‌నగర్‌లో ఢీ అంటే ఢీ..

మహబూబ్‌నగర్ జిల్లా డీసీసీ అధ్యక్షుడిగా దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి ఉన్నారు. పార్టీలో జంట పదవులు వద్దని గతంలో కాంగ్రెస్ హైకమాండ్ సూచించింది. ఈ నేపథ్యంలో జిల్లాలో డీసీసీ పీఠం దక్కించుకునేందుకు మహబూబ్‌నగర్, దేవరకద్ర ఎమ్మెల్యేలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. తమ అనుచరులకే అధ్యక్షుడిగా అవకాశం ఇవ్వాలని ఎవరికి వారు పట్టుబడుతున్నారని సమాచారం. మరోవైపు టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు సంజీవ్ ముదిరాజ్, వినోద్‌కుమార్, న్యాయవాది ఎన్‌పీ వెంకటేశ్, మైనార్టీ వర్గం నుంచి టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అక్తర్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ డీసీసీ పదవిపై ఆశలు పెట్టుకున్నారు. పార్టీని నమ్ముకుని అనేక ఏళ్లుగా సేవలందిస్తున్నామని.. తమకు డీసీసీ అధ్యక్షుడిగా అవకాశం ఇవ్వాలని సంజీవ్ ముదిరాజ్, వినోద్‌కుమార్, ఎన్‌పీ వెంకటేష్ ఎవరికి వారుగా ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

గద్వాలలో సైతం..

గద్వాల జిల్లాలో ప్రస్తుతం డీసీసీ అధ్యక్ష పదవి ఖాళీగా ఉంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరితను ప్రకటించడంతో డీసీసీ అధ్యక్షుడిగా ఉన్న పటేల్ ప్రభాకర్‌రెడ్డి కాంగ్రెస్‌ను వీడి బీఆర్‌ఎస్‌లో చేరడంతో ఆ పదవి ఖాళీ అయింది. అయితే ఆ ఎన్నికల్లో సరిత బీఆర్‌ఎస్ అభ్యర్థి బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి చేతిలో ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత పరిణామాల క్రమంలో వీరిరువురి మధ్య అంతకుముందే ఉన్న విభేదాలు తీవ్ర రూపం దాల్చాయి. తమ అనుచరులకే డీసీసీ పీఠం దక్కేలా వారు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఇదే జిల్లాకు చెందిన ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ తన అనుచరులకే అధ్యక్ష పదవి దక్కేలా ప్రయత్నాలు చేస్తున్నట్లు వినికిడి. కాంగ్రెస్ ఓబీసీ సెల్ చైర్మన్ నల్లారెడ్డి ఈ మేరకు ఆయనను కలిసినట్లు పార్టీలో చర్చ జరుగుతోంది. అదేవిధంగా మైనారిటీ విభాగం నుంచి ఈసారి తనకు అవకాశం ఇవ్వాలని న్యాయవాది షఫీ ఉల్లా కోరుతున్నారు.

వనపర్తిలో నువ్వా.. నేనా..?

వనపర్తి జిల్లాలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి మధ్య విభేదాలు నెలకొన్న విషయం తెలిసిందే. ప్రస్తుతం డీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రాజేంద్రప్రసాద్.. చిన్నారెడ్డి అనుచరుడిగా ముద్రపడ్డారు. ఇక్కడ ఎమ్మెల్యే తన అనుచరుడికి డీసీసీ అధ్యక్ష పదవి ఇప్పించే ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఈ జిల్లా డీసీసీ పీఠం ఎస్సీ సామాజిక వర్గానికి కేటాయిస్తారనే చర్చ జరుగుతోంది. అయితే బీసీ సామాజిక వర్గానికి చెందిన శ్రీనివాస్‌గౌడ్ డీసీసీ అధ్యక్ష పదవిపై ఆశలు పెట్టుకున్నట్లు తెలిసింది.

పేట.. మళ్లీ ప్రశాంత్‌రెడ్డికే..

నారాయణపేట జిల్లా డీసీసీ అధ్యక్షుడిగా మళ్లీ ప్రశాంత్‌రెడ్డి కొనసాగే అవకాశం ఉంది. గత ఎన్నికల్లో ఆయన మక్తల్ ఎమ్మెల్యేగా పోటీ చేయాలని భావించగా.. అధిష్టానం నచ్చజెప్పి డీసీసీ అధ్యక్షుడిగా నియమించింది. ఆ నియోజకవర్గం నుంచి వాకిటి శ్రీహరి ఎమ్మెల్యేగా గెలుపొందారు. కాగా.. త్వరలో జరిగే మంత్రివర్గ విస్తరణలో శ్రీహరికి అవకాశం దక్కనున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో డీసీసీ అధ్యక్షుడిగా మళ్లీ ప్రశాంత్‌రెడ్డికే చాన్స్ ఇవ్వనున్నట్లు సమాచారం. సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గ పరిధి.. నారాయణపేట జిల్లా పరిధిలోని కోస్గి, మద్దూర్ మండలాలకు చెందిన పలువురు నాయకులు డీసీసీ కోసం ప్రయత్నాలు చేస్తున్నా.. ప్రశాంత్‌రెడ్డి వైపు పెద్దలు మొగ్గు చూపుతున్నట్లు తెలిసింది.

నాగర్‌కర్నూల్‌లో భిన్న పరిస్థితి..

నాగర్‌కర్నూల్ జిల్లా కాంగ్రెస్‌లో భిన్న పరిస్థితి నెలకొంది. జోడు పదవుల అంశం పక్కకు పెడితే ప్రస్తుత అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణకే మళ్లీ డీసీసీ అధ్యక్షుడిగా అవకాశం దక్కనుంది. పోటీ లేనప్పటికీ తెలంగాణ రైతు కమిషన్ మెంబర్‌గా ఉన్న వంగూరు మాజీ జెడ్పీటీసీ సభ్యుడు, కొండారెడ్డిపల్లి వాసి కేవీఎన్ రెడ్డి డీసీసీ పదవిని ఆశిస్తున్నట్లు సమాచారం. వీరితో పాటు కాంగ్రెస్ జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు హబీబ్, కల్వకుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్ రెడ్డి, పెద్ద కొత్తపల్లి మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్ గౌడ్, కొల్లాపూర్‌కు చెందిన రాముయాదవ్ తదితరుల జాబితా రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ వద్దకు చేరినట్లు సమాచారం.

రేపు ఢిల్లీలో భేటీ..

అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రాగా.. ఆ వెంటనే జిల్లాలకు కొత్త డీసీసీలను నియమిస్తారని భావించారు. పార్లమెంట్ ఎన్నికలు రావడంతో వాయిదా పడింది. ఈ ఎన్నికల అనంతరం కొద్ది నెలల క్రితం కాంగ్రెస్ హైకమాండ్ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవిని భర్తీ చేసింది. టీపీసీసీ చీఫ్‌గా ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్‌ను నియమించగా.. డీసీసీలను పెండింగ్‌లో పెట్టింది. తాజాగా ఈ నెల 28న ఢిల్లీలో డీసీసీ అధ్యక్షులతో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ భేటీ కానున్నారు. పార్టీ బలోపేతం, అధ్యక్షులు, కార్యవర్గాల కూర్పుపై దిశానిర్దేశం చేయనున్న నేపథ్యంలో జిల్లా కాంగ్రెస్ కమిటీల నియామకం చర్చనీయాంశంగా మారింది. అయితే టీపీసీసీ కార్యవర్గం అనంతరమే జిల్లా, బ్లాక్, మండల కమిటీల నియామకం జరగనున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

సెంట్రల్ యూనివర్సిటీ కేటాయించాలి



మాట్లాడుతున్న పీయూ వీసీ శ్రీనివాస్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: వెనుకబడిన పాలమూరు జిల్లాలో కేంద్ర ప్రభుత్వం ఒక సెంట్రల్ యూనివర్సిటీని మంజూరు చేస్తే పేద విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని పీయూ వీసీ శ్రీనివాస్ పేర్కొన్నారు. పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో పీయూలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని పలు యూనివర్సిటీలను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, వాటికి నిధులు కూడా రాష్ట్ర ప్రభుత్వమే ఇస్తుందన్నారు. ఈ క్రమంలో వాటి అధికారం రాష్ట్ర ప్రభుత్వానికే ఉంటే బాగుటుందని తెలిపారు. యూనివర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ యూజీసీ ప్రైవేట్ డీమ్డ్ యూనివర్సిటీలకు అనుమతి ఇవ్వడంతో విద్య పూర్తిగా వ్యాపారంగా మారిపోయిందని, యూనివర్సిటీలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అధ్యాపకులు కుమారస్వామి, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, విజయ్‌కన్నా, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబ, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పవన్‌కుమార్, కార్యదర్శి సాయికృష్ణ, వెంకటేష్, కావ్య, రేణుక, రజిత పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనకు సమష్టిగా కృషి చేయాలి



ప్రతిజ్ఞ చేస్తున్న అదనపు ఎస్పీ రాములు, డీఎస్పీ వెంకటేశ్వర్లు, తదితరులు

మహబూబ్‌నగర్ క్రైం: మాదక ద్రవ్యాల వల్ల శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలు, కుటుంబాల్లో విచ్ఛిన్నం, ఆర్థిక నష్టం, నేరాల పెరుగుదల, విద్యా మరియు ఉద్యోగ అవకాశాల కోల్పోవడం వంటి అనేక సమస్యలు ఏర్పడతాయని ఏఎస్పీ రాములు పేర్కొన్నారు. పోలీసుశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ వైద్యకళాశాలలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పోలీసులు, వైద్యులు, విద్యార్థులు, ఇతర అధికారులు కలిసి ‘మాదక ద్రవ్యాలను అరికట్టేందుకు కృషి చేస్తాం’ అని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక అవగాహన పోస్టర్ విడుదల చేశారు. అనంతరం ఏఎస్పీ మాట్లాడుతూ మాదకద్రవ్యాల నియంత్రణకు ప్రభుత్వం, పోలీసులు, విద్యాసంస్థలు, తల్లిదండ్రులు, సామాజిక సేవా సంస్థలు అందరూ సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. యువతను సరైన మార్గంలో నడిపించేందుకు అవగాహన కార్యక్రమాలు, కౌన్సెలింగ్, కఠిన చట్టాలు, నిఘా చర్యలు చేపట్టాలన్నారు. ఈ అవగాహన కార్యక్రమం ద్వారా మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ప్రమాదాలు, వాటి నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోలీస్, వైద్య, ఎక్సైజ్ శాఖలు కలిసికట్టుగా చేపడుతున్న చర్యల గురించి సమగ్రంగా వివరించారు. కార్యక్రమంలో మహిళా, శిశు సంక్షేమశాఖ అధికారి జరీనాబేగం, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగేశ్వర్ రెడ్డి, మెడికల్ సూపరింటెండెంట్ సంపత్‌కుమార్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, వైద్య కళాశాల డైరెక్టర్ రమేష్, వైస్ ప్రిన్సిపల్ రమాదేవి, కిరణ్మయి, సీఐ గాంధీ నాయక్ పాల్గొన్నారు.

బీటీ- 3 విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు




భూత్పూర్‌లో పత్తివిత్తన ప్రాసెసింగ్ యూనిట్లలో రికార్డులను పరిశీలిస్తున్న డీఏఓ వెంకటేష్

భూత్పూర్: బీటీ–3 పత్తి విత్తనాలు సాగుచేసినా, అమ్మినా కఠిన చర్యలు తప్పవని డీఏఓ వెంకటేష్ అన్నారు. బుధవారం భూత్పూర్‌లోని పత్తి విత్తన ప్రాసెసింగ్ ప్లాంటు వసంత సీడ్, సాయితేజ ప్రాసెసింగ్ యూనిట్లు, పాలమూరు సీడ్స్, ఆద్య సీడ్స్, ఉవసాన్ సీడ్స్ ప్రాసెసింగ్ యూనిట్, గోపికృష్ణ సీడ్స్, విశాల్ జిన్నింగ్ యూనిట్‌లో డీఏఓ వెంకటేష్ ఆధ్వర్యంలో మూడు బృందాలు తనిఖీలు నిర్వహించాయి. 21 లాట్స్‌లో హెచ్‌టీ టెస్టులు నిర్వహించినట్లు, స్టాక్ రిజిస్టర్లు, లైసెన్స్‌లు, టీసీ, డీసీలు, పత్తి విత్తన నిల్వలు పరిశీలించినట్లు ఆయన వివరించారు. ఏడీఏ యశ్వంత్‌రావు, డీఏఓ కార్యాలయ సాంకేతిక సహాయ సంచాలకులు హైమావతి, జడ్చర్ల ఏడీఏ ఆంజనేయులు, భూత్పూర్, మహబూబ్‌నగర్ అర్బన్, జడ్చర్ల, అడ్డాకుల ఏఓలు మురళీధర్, శ్రీనివాసులు, గోపి, బ్యూలా పాల్గొన్నారు.

నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పరిశ్రమలకు అనుగుణంగా నైపుణ్యాలు పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని పాలమూరు యూనివర్సిటీ రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. పీయూలో బుధవారం కెమిస్ట్రీ, ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ, ఫార్మసీ చివరి సంవత్సరం విద్యార్థులకు లారస్ ల్యాబ్ ఆధ్వర్యంలో క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహించారు. ఈ మొత్తం 80 మంది విద్యార్థులు ఎంపికలో పాల్గొన్నారు. వీరికి ఇంటర్వ్యూ, రాత పరీక్షలు నిర్వహించారు. ఎంపికైన విద్యార్థుల జాబితాను త్వరలో ప్రకటించనున్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు రవికుమార్, అర్జున్, తదితరులు పాల్గొన్నారు.

చివరి విడతకు కొనసాగుతున్న నీటి విడుదల



కోయిల్‌సాగర్ ప్రాజెక్టు

దేవరకద్ర: కోయిల్‌సాగర్ ప్రాజెక్టులో బుధవారం సాయంత్రం వరకు నీటి మట్టం 17 అడుగులకు చేరింది. వానాకాలం ముగిసిన తరువాత డిసెంబర్‌లో యాసంగి సీజన్ నీటిని వదలక ముందు ప్రాజెక్టు నీటి మట్టం 31.6 అడుగులు వద్ద ఉండగా.. డిసెంబర్ 25 నుంచి విడతల వారీగా ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేస్తూ వచ్చారు. ఈనెల 21వ తేదీ చివరి విడత నీటిని విడుదల ప్రారంభించగా.. 30వ తేదీ వరకు కొనసాగుతుంది. ప్రస్తుతం ప్రాజెక్టు కింద వేసిన వరి పంటలు చేతికి వచ్చే సమయం కావడంతో నీటి విడుదలను కొనసాగిస్తున్నారు. పాత ఆయకట్టు కింద ఉన్న వరి పంటలకే నీటిని విడుదల కొనసాగిస్తున్నారు. ఐదు విడతలు కలిపి ఇప్పటి వరకు ప్రాజెక్టు నుంచి 14.6 అడుగుల నీటిని యాసంగి పంటలకు వినియోగించారు. కోయిల్‌సాగర్ ప్రాజెక్టు ఈఈ ప్రతాప్‌సింగ్ మాట్లాడుతూ యాసంగి సీజన్‌లో ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం నీటిని విడుదల చేశామని, ఈనెల 30వ తేదీన ఐదో విడత గడువు ముగుస్తుందని, 31 నుంచి నీటి విడుదల నిలిపివేస్తామని పేర్కొన్నారు. ప్రస్తుతం 17 అడుగులకు నీటి మట్టం పడిపోయిందని, ఉన్న నీటిని వేసవిలో మిషన్ భగీరథ కింద తాగునీటి అవసరాలకు వినియోగించాల్సి ఉంటుందని తెలిపారు.

రూ.27 కోట్ల ఆర్‌అండ్‌ఆర్ నిధులు మంజూరు

జడ్చర్ల: ఉదండాపూర్ రిజర్వాయర్ పరిధిలో నిర్వాసితుల ఆర్‌అండ్‌ఆర్‌కు సంబంధించి రూ.27 కోట్ల నిధులు మంజూరు అయినట్లు జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తెలిపారు. అవార్డు పాసైన వల్లూరు, తదితర గిరిజన తండాలకు పునరావాసానికి ఈ నిధులు విడుదల అయినట్లు పేర్కొన్నారు.

నేడు కవి సమ్మేళనం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 27న స్థానిక పారిశ్రామికవాడలోని సీనియర్ సిటిజన్ ఫోరం కార్యాలయంలో కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఫోరం ప్రధాన కార్యదర్శి నస్కంటి నాగభూషణం ఒక ప్రకటనలో తెలిపారు. ‘ఫోరం’ అధ్యక్షుడు జగపతిరావు అధ్యక్షతన సాయంత్రం 4 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వి.మనోహర్‌రెడ్డి, వల్లభాపురం జనార్దన్, లక్ష్మణ్‌గౌడ్ హాజరవుతారని పేర్కొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌కు నెలాఖరు వరకు గడువు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఎల్‌ఆర్‌ఎస్‌కు ఈ నెలాఖరు వరకు మాత్రమే గడువు ఉందని కలెక్టర్ విజయేందిరబోయి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2020లో దరఖాస్తు చేసుకున్న లేఅవుట్ యజమానులు, డెవలపర్లు, ప్లాట్ల యజమానుల మార్చి 31లోగా ఫీజు చెల్లించి ప్రభుత్వం కల్పిస్తున్న 25శాతం రాయితీని పొందవచ్చని పేర్కొన్నారు. భవిష్యత్‌లో ప్లాటు అమ్ముకోవాలనుకున్న ఎల్‌ఆర్‌ఎస్ ఉన్న ప్లాటుకు మంచి డిమాండ్ ఉంటుందని సూచించారు. ఏమైనా సందేహాలు ఉంటే కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్ 08542-241165తో పాటు మున్సిపల్ కార్పొరేషన్‌లో ఏర్పాటు చేసిన సెల్ నంబర్ 7093911352కు సంప్రదించాలని సూచించారు. దరఖాస్తుదారులు https://lrs.telangana.gov.in వెబ్‌సైట్ లాగిన్ ద్వారా కూడా ఫీజు చెల్లించవచ్చని తెలిపారు.

పేదలకు సన్నబియ్యం

ఉగాది రోజు పథకాన్ని ప్రారంభించనున్న సీఎం రేవంత్

- ఏప్రిల్ ఒకటి నుంచి రేషన్ దుకాణాల్లో పంపిణీ
- జిల్లాలో 22వేల మెట్రిక్ టన్నుల సన్నబియ్యం నిల్వలు



జిల్లాలో చౌకధర దుకాణాలు 506	ప్రతి నెలా కావాల్సిన బియ్యం 4,318 మెట్రిక్ టన్నులు
రేషన్ కార్డులు 2,53,229	
యూనిట్లు 8,16,588	

మహబూబ్‌నగర్ రూరల్: చౌకధరల దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీకి ప్రభుత్వం ముహూర్తం ఖరారు చేసింది. వచ్చేనెల నుంచి తెల్ల రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు ఉగాది రోజున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సన్న బియ్యం పంపిణీని ప్రారంభించనున్నారు. దీంతో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు సన్న బియ్యం పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా మండల లెవల్ స్టాక్ (ఎంఎల్‌ఎస్) పాయింట్ల నుంచి చౌకధర దుకాణాలకు బియ్యం రవాణా ప్రారంభమైంది. వీటిని చౌకధర దుకాణాల్లో యూనిట్‌కు ఆరు కిలోల చొప్పున కార్డుదారులకు అందించనున్నారు. ప్రస్తుతం జిల్లాలో ప్రతి నెలా 4,318 మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం ఉంది. అలాగే కొత్త రేషన్‌కార్డు దారులకు కూడా కోటా ఇవ్వనున్నారు. ప్రస్తుతం గోదాముల నుంచి బియ్యం సరఫరా చౌకధర దుకాణాలకు ప్రారంభించారు. కొత్త రేషన్‌కార్డుదారులకు కూడా బియ్యం పంపిణీ చేయనున్న నేపథ్యంలో కోటా పెరగనున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా 22 వేల మెట్రిక్ టన్నులు సన్నబియ్యం గోదాముల్లో నిల్వలు ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న నిల్వ 4–5 నెలలకు సరిపోతుంది. మిల్లర్ల నుంచి ఇంకా బియ్యం రావాల్సి ఉంది. యాసంగిలోనూ కొనుగోలు కేంద్రాల ద్వారా సన్న ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లర్లకు అప్పగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

అక్రమ రవాణాకు అడ్డుకట్ట..

చౌకధర దుకాణాల్లో రేషన్‌కార్డులో పేర్కొన్న ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున అందిస్తున్నారు. పేదలకు ఉచితంగా సరఫరా చేస్తున్న దొడ్డు బియ్యాన్ని చాలామంది లబ్ధిదారులు తినడం లేదన్నది బహిరంగ రహస్యమే. ఈ బియ్యాన్ని నేరుగా సమీప దుకాణాల్లో, ఇతర వ్యాపారులకు రూ.10 నుంచి రూ.12 చొప్పున విక్రయిస్తున్నారు. కొందరు రేషన్ డీలర్లు లబ్ధిదారుడినే.. బియ్యం కావాలా? డబ్బులు కావాలా? అని అడుగుతున్నారు. ఇలా సేకరించిన బియ్యాన్ని ఇతర జిల్లాల మిల్లులకు తరలించి రీసైక్లింగ్ చేసి తిరిగి విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పేదలకు తినగలిగే నాణ్యమైన బియ్యాన్ని ఇస్తేనే రీసైక్లింగ్ అక్రమాలను అరికట్టవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. వానాకాలం సీజన్ సన్న ధాన్యం సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. సన్న బియ్యం సాగు చేసి విక్రయించిన రైతులకు క్వింటాల్‌కు రూ.500 చొప్పున బోనస్ కూడా చెల్లిస్తుంది. ఇలా వచ్చిన సన్నవడ్లను మర ఆడించిన సన్న బియ్యాన్ని ఆయా పౌర సరఫరాల గోడౌన్లకు సరఫరా చేసి అక్కడి నుంచి చౌకధర దుకాణాల ద్వారా లబ్ధిదారులకు అందించనున్నారు. ఇక నుంచి ఈ అక్రమ బియ్యం దందాకు తెరపడినట్లేనని పలువురు భావిస్తున్నారు.

సన్న బియ్యం పంపిణీకి ఏర్పాట్లు



ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏప్రిల్ నుంచి రేషన్‌కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నాం. గోదాముల నుంచి చౌకధర దుకాణాలకు బియ్యం సరఫరా ప్రారంభించాం. జిల్లాలో సన్న బియ్యం పంపిణీకి ఎలాంటి ఇబ్బంది లేదు. 20 వేల మెట్రిక్ టన్నుల బియ్యం సిద్ధంగా ఉన్నాయి. ఈనెల 31వ తేదీ వరకు సన్న బియ్యం కేటాయింపు, చౌకధర దుకాణాలకు తరలింపు పూర్తి చేస్తాం.

– తోట వెంకటేష్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

క్లుప్తంగా

వృద్ధురాలి అనుమానాస్పద మృతి

ఉప్పునుంతల: మండల కేంద్రంలో బొల్లె శాంతమ్మ (75) అనుమానాస్పదస్థితిలో మృతి చెందినట్లు కుమారుడు బొల్లె వెంకటయ్య ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. శాంతమ్మ మంగళవారం మధ్యాహ్నం ఇంటి ఎదుట స్పృహ తప్పి పడిపోవడంతో కుటుంబ సభ్యులు వెంటనే అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతురాలి కాళ్లు, చేతులతో పాటు శరీర భాగాలపై కాలిన గాయాలు కనిపించడంతో తన తల్లి మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ కుమారుడు ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

ఖిల్లాఘనపురంలో మరో వ్యక్తి..

ఖిల్లాఘనపురం: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన ఖిల్లాఘనపురం మండల కేంద్రంలో బుధవారం వెలుగు చూసింది. పోలీసుల వివరాల మేరకు.. ఖిల్లాఘనపురం గ్రామానికి చెందిన పంతగాని కృష్ణయ్య (42) మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. బుధవారం అతడి దహన సంస్కారాలకు కుటుంబ సభ్యులు, బంధువులు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో మృతుడి మోకాళ్ల వద్ద గాయాలు ఉండటం.. శరీరం మొత్తం ఉబ్బి ఉండటంతో అనుమానం వచ్చి దహన సంస్కారాలను నిలిపివేశారు. ఈ విషయమై మృతుడి చిన్నాన్న ఉద్దంగిరి వెంకన్న పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ సురేష్‌గౌడ్ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా మార్చురీకి తరలించినట్లు పేర్కొన్నారు.

వ్యక్తి బలవన్మరణం


ఆంజనేయులు (ఫైల్)

గోపాల్‌పేట: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని బుద్దారం గ్రామంలో బుధవారం ఉదయం చోటు చేసుకుంది. ఎస్‌ఐ నరేష్‌కుమార్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన దేశమోని ఆంజనేయులు (28)కు ఐదేళ్ల కిందట రేవల్లికి చెందిన కల్పనతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య చిన్న చిన్న గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం రాత్రి అందరూ కలిసి పడుకున్నారు. బుధవారం ఉదయం లేచి చూసేసరికి ఆంజనేయులు ఇంట్లో ఉరేసుకొని మృతిచెంది కనిపించాడు. తల్లి దేశమోని భాగ్యమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

భూమి వివాదంలో కత్తితో దాడి

కృష్ణా: మండలంలోని గుడెబల్లూర్ గ్రామంలో బుధవారం ఇరువర్గాల మధ్య 5 గుంటల భూమి విషయంలో పొలం వద్ద పంచాయితీ నిర్వహించారు. ఈ సమయంలో ఇద్దరు వ్యక్తుల మధ్య మాటమాట పెరిగి ఒక్కసారిగ కత్తితో దాడి చేసిన సంఘటన చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఫొటో గ్రాఫర్ వాకిటి వివేకానంద్, పునాలో నివసించే శంకరప్పలు ఐదుగుంటల భూమి విషయంలో పొలం దగ్గర పంచాయతీ నిర్వహించారు. ఇరువురి మధ్య మాటమాట పెరిగి శంకరప్ప కత్తితో వివేకానంద్‌పై దాడి చేశాడు. వెంటనే గాయపడిన అతను కృష్ణా లోని పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాడు. ఇరువర్గాల వా రు స్టేషన్‌కు చేరారు. ఫిర్యాదు ఇవ్వకపోవడంతో కేసు నమోదు చేయలేదని ఎస్‌ఐ ఎండీ నవీద్ తెలిపారు. ఫిర్యాదు ఇస్తే కేసు నమోదు చేస్తామని అన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

మద్దూరు/కొత్తపల్లి: కొయిలకొండ మండలంలోని శేరి వెంకటాపూర్ నుంచి వాహనంలో రేషన్ బియ్యం 9.90 క్వింటాళ్లు మద్దూరుకు తరలిస్తుండగా విశ్వసనీయ సమాచారం మేర కు పోలీసులు కొత్తపల్లి మండలంలోని దుప్పట్‌గట్ దగ్గర పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ఆనంద్ బియ్యా న్ని పంచనామా నిర్వహించారు. మద్దూరులోని రేషన్ డీలర్ సంజీవ రెడ్డికి అప్పగించారు. రేషన్‌కార్డుదారుల నుంచి రూ.12 కొని మద్దూరు లోని మాల వెంకటప్ప కర్ణాటకకు కిలో రూ.16 చొప్పున అమ్ముతున్నట్లు అధికారులకు తెలిపారు. రేషన్ బియ్యాన్ని తరలించిన వాహనా న్ని, రేషన్ బియ్యం సేకరించిన వెంకటప్పపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

సారా స్థావరాలపై దాడులు

చారకొండ: మండలంలోని గోకారం, చారకొండ, రాంపురం గ్రామాల సమీపంలో ఎక్సైజ్ శాఖ, ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు బుధవారం సారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. 300 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి, పది లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైంజ్ సీఐ జె.వెంకట్ రెడ్డి తెలిపారు. గోకారం గ్రామానికి చెందిన ఇద్దరు మహిళలపై కేసు నమోదు చేశామన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌ఐ కృష్ణ, సిబ్బంది, నర్సింహ్మా, రుక్యా, రఘు, నార్య, పరమేష్, భీమమ్మ ఉన్నారు.



జోరుగా ఉల్లి వ్యాపారం


ఉల్లి కుప్పలతో నిండిన దేవరకద్ర మార్కెట్

- ఉమ్మడి జిల్లాకు కేంద్ర బిందువుగా దేవరకద్ర మార్కెట్
- జిల్లా నలుమూలల నుంచి తరలివస్తున్న వ్యాపారులు
- వాహనాల్లో భారీగా ఉల్లి తరలింపు

దేవరకద్ర: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఉల్లి వ్యాపారానికి కేంద్ర బిందువుగా మారింది దేవరకద్ర మార్కెట్. ప్రతి బుధవారం జరిగే ఉల్లి బహిరంగ వేలానికి జిల్లా నలుమూలల నుంచి వ్యాపారులు తరలివస్తున్నారు. ఉల్లి వ్యాపారంతో మార్కెట్ కళకళలాడుతుంది. సీజన్‌లో 5వేల నుంచి 10వేల బస్తాల ఉల్లి ఇక్కడికి అమ్మకానికి వస్తుంది. మార్కెట్ ఆవరణ మొత్తం ఉల్లి కుప్పలతో నిండిపోతుంది. ఉమ్మడి జిల్లాలోని నాగర్‌కర్నూల్, వనపర్తి, జడ్చర్ల, మహబూబ్‌నగర్, గద్వాల, నారాయణపేట, ఆత్మకూర్, మక్తల్, అచ్చంపేట, కల్వకుర్తి ప్రాంతాలకు చెందిన వ్యాపారులు బహిరంగ వేలంలో పాల్గొని కొనుగోలు చేస్తారు. మరికొందరు రైతులతో నేరుగా కొంటున్నారు. బహిరంగంగానే ఉల్లికి ధర నిర్ణయించడంతో ఇటు రైతులకు లాభం చేకూరుతోంది. ప్రతి ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు ఉల్లి సీజన్ ఉంటుంది.

సీజన్‌లో ప్రతి వారం వస్తాం..



ఉల్లి సీజన్‌లో ప్రతి వారం దేవరకద్ర మార్కెట్‌కు వస్తా. ఇక్కడ ఉల్లి నాణ్యతగా లభిస్తుంది. ఉమ్మడి జిల్లాలో ఉల్లి వ్యాపారానికి దేవరకద్రనే నంబర్ వన్ మార్కెట్. ఇక్కడి నుంచి క్వింటాల్ ఉల్లిని తరలించడానికి రూ. 350 వరకు ఖర్చు అవుతుంది. వేలంలో కొనుగోలు చేసిన ఉల్లిని వాహనాల్లో నేరుగా తరలిస్తాం.

– పర్వతాలు, ఉల్లి వ్యాపారి, అచ్చంపేట

మహారాష్ట్ర, కర్ణాటక వెళ్తాం..



దేవరకద్ర మార్కెట్‌లో ఉల్లి దొరకని రోజుల్లో మహారాష్ట్ర, కర్ణాటక వెళ్లి కొనుగోలు చేస్తాం. ఇక్కడ సీజన్‌లో ఎక్కువగా, అన్ సీజన్‌లో తక్కువగా ఉంటుంది. ఇక్కడ ధరలు పెరిగినప్పుడు వేరే రాష్ట్రాల్లో తక్కువగా ఉంటాయి. అప్పుడు అక్కడి నుంచి ఉల్లిని తెచ్చుకుంటాం.

– వెంకటేష్, ఉల్లి వ్యాపారి, నాగర్‌కర్నూల్

ఇక్కడి వ్యాపారులు సహకరిస్తారు..



ప్రతి వారం ఉల్లిని కొనడానికి దేవరకద్ర మార్కెట్‌కు వస్తా. ఇక్కడి వ్యాపారులు కూడా బయటనుంచి వచ్చిన వ్యాపారులకు సహకరిస్తారు. పని ఒత్తిడితో వేలానికి రాని వారికి ఇక్కడి వ్యాపారులే కొనుగోలు చేసి వాహనాల్లో పంపిస్తారు. ఉల్లి కావాలంటే బుధవారం దేవరకద్రకు వెళ్తే దొరుకుతుందని వ్యాపారులందరూ నమ్మే పరిస్థితి ఉంది.

– చుక్కయ్య, ఉల్లి వ్యాపారి, జడ్చర్ల

అందుబాటులో మార్కెట్..



దేవరకద్ర మార్కెట్ అన్ని విధాలా అందుబాటులో ఉంది. ఇక్కడ కొనుగోలు చేసిన ఉల్లి రవాణాకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు. ఇక బయట మార్కెట్‌లో వచ్చిన ధరలను బేరీజు వేసుకుని ఇక్కడి వ్యాపారులు ఉల్లిని కొనుగోలు చేయడానికి అవకాశం కల్పిస్తారు. దీనివల్ల బయట నుంచి వచ్చే వ్యాపారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా బహిరంగ వేలంలో ఉల్లిని కొనడానికి వీలు కలుగుతుంది.

– విశ్వనాథం, ఉల్లి వ్యాపారి, జడ్చర్ల

నిలకడగా ధరలు..

దేవరకద్ర మార్కెట్‌లో బుధవారం జరిగిన వేలంలో ఉల్లి ధరలు నిలకడగానే ఉన్నాయి. రెండు వారాలుగా దిగివచ్చిన ధరలే ఈ వారం వచ్చాయి. ఉదయం 10 గంటలకే ఉల్లి వేలం ప్రారంభం కాగా.. క్వింటాల్ ఉల్లి గరిష్ఠంగా రూ. 2,000 నుంచి రూ. 1,800 వరకు పలికింది. కనిష్ఠంగా రూ. 1,000 నుంచి రూ. 1,600 ధర వచ్చింది. అయితే గరిష్ఠ , కనిష్ఠ ధరలు అటు, ఇటుగా రావడంతో వ్యాపారులు ఏ కుప్పకు ఆ కుప్పకు బస్తా ధర నిర్ణయించి అమ్మకాలు సాగించారు. మార్కెట్ నిబంధనలు సడలించిన తర్వాత ఉల్లి బస్తా 50 కేజీలుగా నిర్ణయించారు. ఒక్కో బస్తా గరిష్ఠంగా రూ. 1,000 నుంచి రూ. 900 వరకు విక్రయించగా.. కనిష్ఠంగా రూ. 800 నుంచి రూ. 500 వరకు అమ్మకాలు సాగించారు.

10వేల బస్తాల రాక..

మార్కెట్‌కు దాదాపు 10వేల బస్తాల ఉల్లి అమ్మకానికి వచ్చింది. మార్కెట్‌లో దాదాపు 40 ట్రేడింగ్ షాపులు ఉండగా.. మధ్యాహ్నం వరకు కేవలం 5 షాపుల్లో వేలం ముగిసింది. వేలం వేయడానికి సమయం సరిపోకపోవడంతో వ్యాపారులు ఒకే నాణ్యతతో ఉన్న ఉల్లి కుప్పలను చూసి.. వాటికి ధరలు నిర్ణయించి కొనుగోలు చేశారు. అయితే కొందరు వ్యాపారులు రైతులతో నేరుగా కొనుగోలు చేసి అమ్మకాలు సాగించారు. మార్కెట్‌కు వినియోగదారులు పోటెత్తడంతో వ్యాపారం జోరుగా సాగింది. ఉల్లిని ఏడాదిపాటు నిల్వ చేసుకునే అవకాశం ఉండటం వల్ల వినియోగదారులు బస్తాలుగా ఉల్లిని కొనుగోలు చేశారు.

భారీగా తరలింపు..

ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులు భారీగా ఉల్లిని కొనుగోలు చేశారు. అక్కడే వాహనాల్లో నింపి తమ ప్రాంతాలకు తరలించారు. ఇక మహబూబ్‌నగర్ నుంచి చిరు వ్యాపారులు బొలెరో, ట్రాలీ ఆటోల ద్వారా తెచ్చి పెద్దఎత్తున ఉల్లిని కొనుగోలు చేశారు. దేవరకద్ర మార్కెట్ ఉదయం నుంచి సాయంత్రం వరకు సందడిగా కనిపించింది.


దేవరకద్ర మార్కెట్‌లో ఉల్లిని వేలం వేస్తున్న వ్యాపారులు

ఆగని అన్వేషణ


సొరంగంలోకి వెళ్తున్న సహాయక సిబ్బంది

- ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్‌లో 33 రోజులుగా కొనసాగుతున్న సహాయక చర్యలు
- మట్టి, రాళ్ల తొలగింపు పనులు ముమ్మరం
- ఆరుగురి ఆచూకీ కోసం ప్రయత్నాలు


సొరంగం నుంచి బయటికి తెచ్చిన టీబీఎం భాగాలు, పైపులు

అచ్చంపేట: ఎస్‌ఎల్‌బీసీ సొరంగంలో రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది. సొరంగంలో చిక్కుకున్న వారి ఆచూకీ కనుకొనేందుకు 33 రోజులుగా సహాయక చర్యలు చేపడుతున్నారు. నాలుగు ఎక్స్‌వేటర్లతో మట్టి తవ్వకాలు కొనసాగిస్తూ.. కన్వేయర్ బెల్టు ద్వారా మట్టిని బయటికి తరలిస్తున్నారు. మట్టి, రాళ్లు, బురద తీతకు అడ్డుపడుతున్న టీబీఎం భాగాల తొలగింపును వేగవంతం చేశారు. నిరంతరాయంగా వస్తున్న నీటి ఊటను సొరంగం లోపల 2.5 కి.మీ. ఒకటి చొప్పున 150 హెచ్‌పీ సామర్థ్యంగల 5 పంపింగ్ స్టేషన్లు ఏర్పాటుచేసి.. నిమిషానికి 3,600 లీటర్ల నీటిని కృష్ణానదికి పంపింగ్ చేస్తున్నారు. కాడవర్ డాగ్స్ గుర్తించిన డీ1, డీ2 ప్రదేశాల్లో మట్టి, రాళ్లు, బురద, టీబీఎం భాగాలను తొలగించడంతో పాటు అనుమానిత ప్రాంతాల్లో తవ్వకాలు జరుపుతున్నారు. మంగళవారం 13.55 కి.మీ. వద్ద లభించిన మనోజ్‌కుమార్ మృతదేహం సమీపంలో డీ1కు 300 మీటర్ల ముందు భాగంలో తవ్వకాలు కొనసాగిస్తున్నారు. ఇప్పటి వరకు 50 మీటర్ల వరకు మట్టిని తొలగించి కన్వేయర్ బెల్టు ద్వారా తరలించారు. సొరంగం చివరి పాయింట్ వరకు మరో 150 మీటర్ల వరకు మట్టిని తొలగిస్తే.. మిగిలిన ఆరుగురి ఆచూకీ లభించే అవకాశం ఉందని, ఏప్రిల్ 10వ తేదీ నాటికి రెస్క్యూ ఆపరేషన్ ముగిస్తామని సహాయక సిబ్బంది చెబుతున్నారు.

నాలుగు ఇటాచ్‌లతో..

సొరంగంలో చిక్కుకున్న వారి ఆచూకీ తెలుసుకునేందుకు నాలుగు మినీ ఇటాచ్‌లతో మట్టి, రాళ్లను తొలగిస్తున్నారు. మట్టి, రాళ్లను కన్వేయర్ బెల్టు ద్వారా బయటికి పంపిస్తుండగా.. కత్తిరించిన టీబీఎం భాగాలను లోక్ ట్రెన్ ద్వారా తీసుకువస్తున్నారు. చివరి 40 మీటర్ల వరకు సహాయక సిబ్బంది అతికష్టం మీద చేరుకుని కార్మికుల కోసం గాలింపు కొనసాగిస్తున్నారు. మట్టిని తొలగించే కొద్దీ భారీగా వస్తున్న నీటి ఊట వల్ల సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోంది. సొరంగంపై 600 మీటర్ల ఎత్తున ఉన్న బండరాళ్లు, మట్టి కూలే ప్రమాదం ఉందని భావిస్తున్నారు. అయితే ఎన్‌డీఆర్‌ఎఫ్ నిపుణుల సూచనల మేరకు సహాయక చర్యలు కొనసాగించాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు.

సహాయక చర్యలు ముమ్మరం..

ఎస్‌ఎల్‌బీసీ సొరంగంలో ప్రమాదం చోటు చేసుకున్న ప్రదేశంలో నిరంతరాయంగా సహాయక చర్యలు కొనసాగుతున్నాయని డిజాస్టర్ అండ్ మేనేజ్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్‌కుమార్ అన్నారు. బుధవారం సొరంగం ఇన్‌లేట్ వద్ద సహాయక చర్యలపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం నియమించిన ప్రత్యేకాధికారి శివశంకర్ లోతేటి, కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, ఆర్మీ కల్నల్ పరీక్షిత్ మెహ్రా, వికాస్ సింగ్, ఎన్‌డీఆర్‌ఎఫ్ అధికారి డా.హరీశ్, సింగరేణి రెస్క్యూ జీఎం బైద్యం, ఆర్డీఓ సురేశ్, ఇరిగేషన్ ఈఈ శ్రీనివాస్ సొరంగం లోపలి పరిస్థితులను ఆయనకు వివరించారు. మట్టి త్వవకాలు, ఊట నీటి పంపింగ్ ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతుందన్నారు. ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో ఉంటూ సహాయక బృందాలకు అవసరమైన సూచనలు, సలహాలు ఇస్తూ సొరంగంలో చిక్కుకున్న వారి ఆచూకీ కనుగొనేందుకు 24 గంటలు శ్రమిస్తున్నట్లు తెలిపారు.


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న అరవింద్ కుమార్

రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి

- రంగారెడ్డి జిల్లా కొత్తూరు సమీపంలో బైకును ఢీ కొట్టిన లారీ
- అనాథలుగా మారిన నలుగురు పిల్లలు
- కల్వకుర్తి మండలం రఘుపతిపేటలో విషాదం


సక్కుభాయి, పాండు (ఫైల్)

కల్వకుర్తి రూరల్: లారీ రూపంలో వచ్చిన మృత్యువు వారి కుటుంబం పాలిట యమపాశమైంది. అప్పటివరకు నలుగురు(ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు కుమారులు) పిల్లలతో సరదాగా సాగిపోతున్న వారి జీవితంలో అనుకోని సంఘటన ఎదురైంది. రంగారెడ్డి జిల్లా తిమ్మాపూర్ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి చెందారు. వివరాల్లోకి వెళితే.. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం రఘుపతి పేటకు చెందిన భార్యభర్తలు సక్కుభాయి (40), పాండు (45) 12 ఏళ్ల క్రితం హైదరాబాద్‌లోని రామంతాపూర్‌కు వెళ్లి అక్కడే స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారు. వారికి నలుగురు పిల్లలు మధుమిత, మధురుషిత, యాద్విక్, యశిత్..పిల్లలున్నారు. సక్కుభాయి మహేశ్వరం మండలంలోని ఎన్‌డీతండాలో పంచాయతీ కార్యదర్శిగా, పాండు అంబర్‌పేట్‌లోని పోలీస్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం స్కూటీపై సుక్కుభాయి తమ అమ్మగారి గ్రామమైన కొందుర్గులో ఉన్న తమ వ్యవసాయ పొలంలో జరుగుతున్న పండ్లతోట పనులను పరిశీలించి తిరిగి సాయంత్రం రామంతాపూర్‌కు బయల్దేరారు. కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపూర్ శివారు ప్రాంతంలో వీరు ప్రయాణిస్తున్న స్కూటీని లారీ అతివేగంగా ఢీ కొట్టింది. దీంతో సక్కుభాయి అక్కడికక్కడే మృతి చెందగా, భర్త తీవ్ర గాయాలతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. రోడ్డు ప్రమాదంలో తల్లిదండ్రులను కోల్పోవడంతో ఆ నలుగురు చిన్నారులు అనాథలుగా మారారు. ఈ ఘటనతో వారి స్వగ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పోస్టుమార్టం ముగిసిన అనంతరం మృతదేహాలను రఘుపతిపేటకు తరలించి బుధవారం సాయంత్రం అంత్యక్రియలు ముగించారు.

అలంపూర్ ఆలయాల హుండీ లెక్కింపు


హుండీ లెక్కింపులో సేవాసంస్థల సభ్యులు


నగదును బ్యాంకు సిబ్బందికి అప్పగిస్తున్న ఆలయ అధికారులు

అలంపూర్: స్థానిక జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాల హుండీ లెక్కింపు బుధవారం కొనసాగింది. రెండు ఆలయాల్లోని హుండీని లెక్కించగా రూ.72,95,339 ఆదాయం వచ్చినట్లు ఈఓ పురేందర్ కుమార్ తెలిపారు. దేవాదాయ, ధర్మాదాయశాఖ సహాయ కమిషనర్ మదనేశ్వర్‌రెడ్డి, ఆలయ పాలకమండలి చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, ఈఓ పురేందర్‌కుమార్ పర్యవేక్షణలో హుండీలు తెరిచారు. మొత్తం 106 రోజులకుగాను అమ్మవారి ఆలయ హుండీలో రూ.60,76,562, స్వామివారి హుండీలో రూ.11,79,888, అన్నదాన సత్రం హుండీతో రూ.38,889 మొత్తం రూ.72,95,339 ఆదాయం సమకూరినట్లు ఈఓ వివరించారు. వీటితోపాటు విదేశీ కరెన్సీ యూఎస్ డాలర్స్–14, మలేషియన్ రింగిట్–7, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఓమాన్ రైల్–1 ఉన్నాయని.. మిశ్రమ బంగారం 56 గ్రాములు, మిశ్రమ వెండి 222 గ్రాములు వచ్చినట్లు పేర్కొన్నారు. హుండీ లెక్కింపు సహాయ కమిషనర్ పర్యవేక్షణలో కొనసాగగా.. గద్వాల, వనపర్తి, కొత్తకోట, కర్నూలుకు చెందిన వివిధ సేవా సంస్థలు పాల్గొన్నాయి.

మద్దిమడుగు పబ్బతి ఆంజనేయస్వామి ఆలయంలో..

మన్ననూర్: నల్లమలలోని మద్దిమడుగు పబ్బతి ఆంజనేయస్వామి ఆలయ హుండీ లెక్కింపు బుధవారం నిర్వహించారు. డివిజనల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరమ్మ, ఆలయ కమిటీ చైర్మన్ డి.రాములు సమక్షంలో లెక్కించగా రూ. 14,69,624 నగదు, 1.4 కిలోల మిశ్రమ వెండి సమకూరింది. నగదును బ్యాంకులో జమ చేశారు. కార్యక్రమంలో ఈఓ నర్సింహులు, డైరెక్టర్లు సుబ్బదాసు, శ్రీను, వెంకటేశ్వర్‌రెడ్డి, ఆలయ అర్చకుడు వీరయ్యశర్మ, బ్యాంకు సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఊర్కొండపేట ఆలయంలో..



ఊర్కొండ: మండలంలోని ఊర్కొండపేట పబ్బతి ఆంజనేయస్వామి ఆలయ హుండీని బుధవారం ఆలయ చైర్మన్ నారెడ్డి సత్యనారాయణరెడ్డి, ఈఓ సత్యనారాయణరెడ్డి, దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వీణాధరి ఆధ్వర్యంలో లెక్కించారు. 2 నెలల 5 రోజులకుగాను రూ.5,10,977 ఆదాయం సమకూరిందని చైర్మన్ వివరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ కృష్ణదేవ, పాలకమండలి సభ్యులు బొందయ్య, మల్లేష్, ఆంజనేయులు, బంగారయ్య, రమేష్, వెంకటమ్మ, మహేష్ అయ్యగారు, నాయకులు మనోహర్‌రెడ్డి, శ్రీశైలం , ఆలయ అధికారులు మారుతీరావు, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మంద నిలబెడదాం.. భూసారం పెంచుదాం


పొలంలో మందకట్టిన గొర్రెలు

- మేకలు, గొర్రెల ఎరువులతో లాభాలు
- పంట పొలంలో పెంపొందే పోషకాలు

పాడి-పంట

అధికారి సలహా: సక్రియనాయక్, జిల్లా వ్యవసాయాధికారి, గద్వాల

గొర్రె పెంపకంలో పోషకాల విలువ గ్రాములు/కిలో	
నత్రజని	11.0
భాస్వరం	5.0
పొటాష్	3.2
కాల్షియం	9.0
మాంగనీస్	0.15
ఇనుము	0.99
ఉదజని సూచిక	7.6

అలంపూర్: ఖరీఫ్, రబీలో సాగు చేసిన పంటలు రైతుల చేతికందాయి. పంట సాగు చేసిన పొలాలు ప్రస్తుతం ఖాళీగా ఉన్నాయి. పంట పొలాల్లో భూసారం పెంచుకోవడానికి గొర్రెల, మేకల మందను కట్టించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియనాయక్ రైతులకు సూచించారు. జీవాల మలమూత్రాలు సేంద్రియ ఎరువులుగా మారి పంట భూములకు అవసరమైన పోషకాలను అందిస్తాయని వ్యవసాయాధికారులు వివరిస్తున్నారు. పొలాల్లో గొర్రెల, మేకల మందలు కట్టించడం వలన వచ్చే సీజన్‌లో వేసే పంటలకు మేలు జరుగుతుంది. సేంద్రియ ఎరువుల వినియోగంపై రైతుల్లో అవగాహన పెంపొందించుకోవడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. భూమికి అవసరమైన పోషకాలను అందించడంతోపాటుగా భూమి పటిష్టతను పెపొందిస్తుందని వివరిస్తున్నారు. ప్రస్తుతం అవకాశం ఉన్న రైతులు తమ పొలాలు ఖాళీ అవుతుండటంతో గొర్రెలు, మేకలతో మంద కట్టించుకోవాలని పేర్కొంటున్నారు.

ఇలా చేసుకోవాలి :

గొర్రెలు, మేకల దొడ్లలో ఎరువులను పశువుల ఎరువుల మాదిరిగా నిల్వచేసి పొలానికి వాడుకోవచ్చు. రబీలో మినుము తీత వరికోత పూర్తవ్వగానే ఆయా పంట పొలాల్లో జీవాలను మంద కట్టిస్తున్నారు. మంద కట్టిస్తే జీవాలు మలమూత్రాలను విసర్జిస్తాయి. అవి సేంద్రియ ఎరువుగా భూమికి అవసరమైన పోషకాలను అందిస్తాయి. మంద కట్టిన తర్వాత ఒకసారి పొలాన్ని దుక్కిదున్నిస్తే ఎరువు నేలలో కలిసిపోయి పోషకాలు వృథాకాకుండా ఉంటాయి.

మంద కట్టడం ద్వార జీవనం :

పంట పొలాల్లో మేకలు, గొర్రెలను మంద కట్టించడం ద్వారా పెంపకందార్లు జీవనం సాగిస్తారు. ఎకరం పొలంలో సుమారు వెయ్యి వరకు జీవాలను మందకట్టిస్తారు. ఇందుకుగాను రైతువారీగా ఒక్కొక్కరు రూ.500 నుంచి రూ. 600 వరకు పెంపకందార్లకు ఇస్తారు.

వలస వచ్చి జీవనం..

అలంపూర్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు జీవాల పెంపకందార్లు వలస వస్తారు. జిల్లాలోని పెబ్బేరు, కొత్తకోట, కొల్లాపురం వంటి ప్రాంతాల నుంచి జీవాలు ఇక్కడికి తీసుకువస్తారు. ఈ ఏడాది దాదాపు 40 వేల జీవాలు వలస వచ్చాయి. రెండు నెలల క్రితమే జీవాల పెంపకందార్లు వలస వచ్చారు. ఖాళీ భూముల్లో జీవాలను మేపుతూ నెలల తరబడి జీవనం గడుపుతారు. మంద కట్టించడం ద్వారా పొలాలకు పోషకాలను అందించడంతోపాటు పెంపకందార్లను ఆదరించినట్లు అవుతుంది.

క్షుద్రపూజల కలకలం



నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లాకేంద్రంలోని రాంనగర్‌కాలనీలో ఉన్న ఓ పాడుబడ్డ ఇంటి ఎదుట గుర్తుతెలియని వ్యక్తులు క్షుద్రపూజలు చేసిన ఆనవాళ్లు బుధవారం కనిపించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. పోలీసులు వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.